క్లుప్తంగా

రోలర్ స్కేటింగ్‌లో నగర విద్యార్థులకు పతకాలు



గుంటూరు ఎడ్యుకేషన్: వైజాగ్‌లో ఈనెల 14 నుంచి 18 వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌లో గుంటూరుకు చెందిన నెక్స్ట్‌జెన్ రోలర్ స్కేటింగ్ అకాడమీ విద్యార్థులు పతకాలు సాధించారు. అమరావతి రోడ్డులోని నెక్స్ట్‌జెన్ అకాడమీలో గురువారం నిర్వహించిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో అధ్యక్షుడు జె. హరిబాబు మాట్లాడుతూ పోటీల్లో పాల్గొన్న 14 మంది విద్యార్థుల్లో వి. మోక్షిత్ రామ్, పి. నితీష్, వై. రామ్ కౌశిక్, సి. మోనిష్ కృష్ణ, టి. ఉద్దీప్ త్రివేది, బి. మనోహర్, టి. లక్ష్మీ ఆశ్రిత, ఎస్. హేమణ్య పతకాలను పొందారని తెలిపారు. కార్యక్రమంలో అరుణ్‌బాబు పాల్గొన్నారు.

26న రజక ఆత్మగౌరవ సభ

నెహ్రూనగర్: ఆంధ్రప్రదేశ్ రజక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈ నెల 26న రజక ఆత్మగౌరవ మహాసభను నాగార్జున యూనివర్సిటీ ఎదురు చిట్యాల ఐలమ్మ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ రాచకొండ జాన్‌బాబు తెలిపారు. అరండల్‌పేటలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. చట్ట సభల్లో రజకులకు తగిన ప్రాధాన్యత, రజక మహిళల భద్రతకు ప్రత్యేక చట్టం ఏర్పాటుతో పాటు పలు తీర్మానాలు చేయనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో రజక సంఘాల నాయకులు గుంటగల సాంబశివరావు, వాడాల నాగరాజు, కొల్లూరి శివ, తుమ్మేటి కృష్ణ పాల్గొన్నారు.

మహా ధర్నాను జయప్రదం చేయండి



తెనాలిఅర్బన్: కార్మికులు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, ప్రజల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఈ నెల 27, 28 తేదీల్లో విజయవాడలో మహాధర్నా నిర్వహించనున్నట్లు ఆ సంఘ జిల్లా నాయకులు కొల్లిపర బాబుప్రసాద్ తెలిపారు. చెంచుపేటలోని ప్రజా సంఘాల కార్యాలయంలో గురువారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం మూడు వ్యవసాయ చట్టాలను తీసుకువచ్చిందని, వాటి రద్దు కోసం అనేక పోరాటాలు చేసి విజయం సాధించినట్లు తెలిపారు. రైతుల డిమాండ్‌లను ప్రభుత్వం తీర్చడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల హక్కులను కాలరాసే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు జోనేష్, వెంకటసుబ్బయ్య, శేషగిరిరావు, శివరామకృష్ణ, అశోక్‌కుమార్, నాగరాజు, సాంబశివరావు, బ్రహ్మారెడ్డి, షేక్ హుస్సేన్‌వలీ పాల్గొన్నారు.

రేషన్ పంపిణీలో అక్రమాలపై చట్టపరమైన చర్యలు




కొల్లిపర: రేషన్ సరుకులు పంపిణీలో అక్రమాలు జరిగితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ జి.నాంచారయ్య ఎండీయూ ఆపరేటర్లను, రేషన్ షాపు డీలర్లను హెచ్చరించారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఎండీయూ ఆపరేటర్లు, రేషన్ షాపు డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ల ద్వారా ఇంటింటి సరఫరా కచ్చితంగా జరగాలన్నారు. రేషన్ సరుకులు అందలేదని లబ్ధిదారుల వద్ద నుంచి ఫిర్యాదులు వస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్ జేవీఎస్ఎన్ మూర్తి, ఆర్ఐ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

ఫిరంగిపురం: 18 ఏళ్లు నిండిన యువకులు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ పద్మనాభుడు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మార్నింగ్ స్టార్ డిగ్రీ కళాశాలలో గురువారం ఓటు హక్కు, ఎలా దరఖాస్తు చేసుకోవాలి, ఓటు హక్కు వినియోగం, ఫారం 6,7,8 గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పద్మనాభుడు మాట్లాడుతూ 17 ఏళ్లు జరుగుతున్న వారు తమ పేరు తగిన పత్రాలు అందజేసి నమోదు చేసుకోవచ్చని చెప్పారు. ఓటర్ నమోదు కోసం హెల్ప్‌లైన్ పోస్టల్ నమోదు చేసుకున్నట్లయితే సిబ్బంది ద్వారా ఓటు హక్కు కల్పించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ విలియమ్స్, ప్రిన్సిపాల్ హరినాథరెడ్డి పాల్గొన్నారు.

ఏపీలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు

అట్టహాసంగా పలు డివిజన్లల్లో కార్యక్రమాలు



మా నమ్మకం నువ్వే జగనన్న బోర్డుల వద్ద ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్

నగరంపాలెం: ఏపీలో అభివృద్ధి, సంక్షేమాన్ని సీఎం వై.ఎస్.జగన్ పరుగులు పెట్టిస్తున్నారని ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ పేర్కొన్నారు. 28వ డివిజన్‌లోని హౌసింగ్ బోర్డు ఆర్చి (97వ సచివాలయం) వద్ద, 33వ డివిజన్‌లోని రామన్న పేట 2/1 (125వ సచివాలయం) వద్ద, 44వ డివిజన్‌లోని కొరిటిపాడు సెంటర్ గాంధీ బొమ్మ (132వ సచివా లయం) వద్ద 'మా నమ్మకం నువ్వే జగనన్న ప్రచార బోర్డులు, ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే? కార్యక్రమాల్ని గురువారం నిర్వహించారు. ఆయా సచివాలయాల పరిధిలోని ప్రాంతాల్లో నేతలు పర్యటించి, అమలు చేసిన సంక్షేమ పథకాల్ని వివరించారు. ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ సీఎం వై.ఎస్.జగన్‌కు అభివృద్ధి, సంక్షేమం అనేవి రెండు కళ్లు అని తెలిపారు. ఏ ఒక్క సంవత్సరంలోనూ ఆ రెండు నిలిచిపోలేదని చెప్పారు. కోవిడ్–19 తొలి దశ, రెండో దశలోనూ అభివృద్ధి, సంక్షేమం పక్కాగా అమలు చేశారని ఆయన గుర్తుచేశారు. దేశంలోనే ఒక నూతన ఒరవడికి నాంది పలికారని పేర్కొన్నారు. గత టీడీపీ హయాంలో అభివృద్ధి, సంక్షేమం కుంటుపడ్డాయని ఆరోపించారు. గతంలో జిల్లా, నగరంలోని ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాలంటే ప్రయాణ చార్జీలు, గంటల కొద్ది నిరీక్షణ చేయాల్సి ఉండేదని చెప్పారు. వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వ హయాంలో ఇళ్ల వద్దనే ఉన్న వార్డు, గ్రామ సచివాలయాల్లో సంక్షేమ పథకాలకు దరఖాస్తులు చేసుకుంటున్నారని తెలిపారు. తద్వారా ప్రభుత్వ సేవలు ప్రజలకు సులభతరంగా మారాయని వివరించారు. ఇక ముందు ఇదే అభివృద్ధి, సంక్షేమ పథకాలు పంపిణీ కావాలంటే మరోసారి వై.ఎస్.జగన్‌నుసీఎంగా చేయాలని పిలుపునిచ్చారు. ఆయా కార్యక్రమాల్లో కార్పొరేటర్లు పడాల సుబ్బారెడ్డి (28వ డివిజన్), గోపి శ్రీనివాస్ (38వ డివిజన్), వంగల హేమలత (44వ డివిజన్), జేసీఎస్ క్లస్టర్ల ఇన్‌చార్జ్‌లు సురసాని వెంకటరెడ్డి, నూనె ఉమామహేశ్వరరెడ్డి, మహమ్మద్ బాబూఖాన్, బైరెడ్డి రంగారెడ్డి, ఎరువ ఇన్నారెడ్డి, బత్తుల దేవానంద్, బందా రవీంద్రనాథ్, వంగల వలి వీరారెడ్డి, దాసరి రమేష్, విష్ణువర్ధన్‌రెడ్డి, కోటేశ్వరమ్మ, గోవిందరెడ్డి, ప్రసన్న లక్ష్మి పాల్గొన్నారు.

నగరంలో ఈట్ స్ట్రీట్

- రాజాగారి తోటలో స్థల పరిశీలన
- రాత్రి 10 గంటల నుంచి ప్రారంభం



రాజాగారి తోటలో పర్యటిస్తున్న మేయర్ కావటి, తూర్పు ఎమ్మెల్యే ముస్తఫా

నెహ్రూనగర్: నగరంలో ఈట్ స్ట్రీట్ ఏర్పాటు చేయనున్నట్లు మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు తెలిపారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో గాంధీ పార్క్ వెనుక వైపు (రాజా గారి తోట) ప్రతిపాదిత ప్రాంతాన్ని తూర్పు ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా, నగరపాలక సంస్థ, పోలీసు అధికారులతో కలసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరానికి హాస్పిటల్, వ్యాపార, విద్యా సంబంధ పనులపై నిత్యం వేలాది మంది సుదూర ప్రాంతాల నుంచి వస్తారని, వీరంతా రాత్రి 10 గంటల తరువాత సరైన భోజనం దొరక్క తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గతంలో కరోనాకి ముందు హిందూ కాలేజీ సెంటర్‌లో ఫుడ్ కోర్టు ఉండేదని, నిబంధనల ప్రకారం దాన్ని ఆపి వేశామని పేర్కొన్నారు. ట్రాఫిక్ సమస్యల వల్ల సదరు ప్రాంతంలో ఈట్ స్ట్రీట్ ఏర్పాటు కూడా నిలిపి వేసినట్లు చెప్పారు. ప్రస్తుతం ఈట్ స్ట్రీట్‌ను ట్రాఫిక్‌కు అడ్డంకులు లేకుండా ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. విజయవాడ, తిరుపతి, వైజాగ్ నగరాల్లో ఇప్పటికే ఏర్పాటు చేశారని, వాటిని పరిశీలించి అదే తరహాలో గుంటూరు నగరంలో కూడా గాంధీ పార్కు వెనుక ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. పార్కు వెనుక రోడ్డు 250 మీటర్లు ఉందని తెలిపారు. రాత్రి 10 గంటల నుంచి ఈట్ స్ట్రీట్ మొదలవుతుందని, ఉదయానికి ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయిస్తామని వివరించారు. చుట్టుపక్కల నివాసాల వారికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. పోలీసు శాఖ సహకారంతో ఈట్ స్ట్రీట్‌కు కుటుంబంతో వచ్చేలా నిర్వహిస్తామని తెలిపారు. రాత్రిళ్లు పని చేసే మార్కెట్, ముఠా కార్మికులకు ఆహారం అందుబాటులో ఉండడంతో పాటు, చిరు వ్యాపారులకు ఆదాయ వనరుగా కూడా దోహదపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా, కార్పొరేటర్ యాట్ల రవి, నగరపాలక సంస్థ ఎస్ఈ భాస్కరరావు, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, ప్రజారోగ్య అధికారులు, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

ఆర్‌వీఆర్‌జేసీలో ఐఈఈఈ అస్త్ర–2023 ప్రారంభం



దినేష్‌రెడ్డిని సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: ప్రపంచవ్యాప్తంగా జరిగే నూతన ఆవిష్కరణల అవగాహనలకు ఐఈఈఈ మంచి వేదికని సౌత్ సెంట్రల్ రైల్వేస్ గుంటూరు డివిజన్ సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ సీహెచ్. దినేష్‌రెడ్డి పేర్కొన్నారు. చౌడవరంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఐఈఈఈ చాప్టర్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరగనున్న అస్త్ర–2023 కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవిష్యత్తులో రాబోయే సాంకేతిక పరిజ్ఞానాన్ని దృష్టిలో పెట్టుకొని అధ్యాపక బృందం, విద్యార్థులకు నూతన ఆలోచనలతో విజయ అవకాశాల దిశగా పరిశోధనల వైపు తర్ఫీదుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. కళాశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన పవర్ అండ్ ఎనర్జీ సొసైటీ, కంప్యూటర్ సొసైటీ చాప్టర్‌లను ఆయన ప్రారంభించారు. కళాశాలలో చేపడుతున్న కార్యక్రమాల్ని ప్రోత్సహిస్తూ ఐఈఈఈ యూఎస్ఏ చాప్టర్ 450 డాలర్స్‌ను, ఫొటో కాంపిటీషన్‌లో కళాశాల చాప్టర్‌కు రెండో స్థానం లభించినందుకు 250 డాలర్స్‌ను విడుదల చేయడం గర్వకారణమని కళాశాల అధ్యక్షుడు ఆర్. శ్రీనివాస్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఆర్. గోపాలకృష్ణ తెలిపారు. టెక్నాలజీ రంగంలో పెరిగిపోతున్న పోటీని దృష్టిలో పెట్టుకొని స్వీయ ఆలోచనలతో వ్యక్తిత్వ నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకునేందుకు విద్యార్థులు ఐఈఈఈలో భాగస్వాములు అవ్వడం ఎంతో అవసరమని కళాశాల ట్రెజరర్ కె. కృష్ణప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో వివిధ కళాశాలకు చెందిన 350 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె. శ్రీనివాస్, డైరెక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ ఎస్.వి. శ్రీనివాసరావు, ఎం.వి.పి. చంద్రశేఖర్, శ్రీకృష్ణ, కెస్వర్ణ, పి.త్రిపుర పాల్గొన్నారు.

విజ్ఞాన్ అధ్యాపకుడికి పీహెచ్‌డీ



చేబ్రోలు: వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ విభాగానికి చెందిన అధ్యాపకుడు కర్రి మరియదాసుకు విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టా అందజేసిందని వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్ గురువారం తెలిపారు. పల్నాడు జిల్లాలో భూగర్భ జలాల అంచనా – ప్రభావాలు, తాగునీరు, నీటిపారుదల నాణ్యత'' అనే అంశంపై ఆయన పరిశోధన చేశారని తెలియజేశారు. పీహెచ్‌డీ పట్టా పొందిన కర్రి మరియదాసును చైర్మన్ లావు రత్తయ్య అభినందించారు.

గుండె ఆరోగ్యంపై జాగ్రత్తలు అవసరం



తాడేపల్లిరూరల్ : ప్రతి ఒక్కరూ గుండె ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని కేఎల్ యూనివర్సిటీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చక్రవర్తి అన్నారు. తాడేపల్లి రూరల్‌పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్‌యూ ఫార్మసీ కళాశాల, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఆకస్మాత్తుగా గుండెపోటుకు గురైతే ఎలాంటి జాగ్రత్త చర్యలు తీసుకోవాలనే అంశంపై కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మణిపాల్ వైద్యులు శ్రీనివాసన్ మాట్లాడుతూ గుండెపోటు వచ్చిన సమయంలో రోగికి సీపీఆర్ చేసే విధానంపై విద్యార్థులకు, అధ్యాపకులకు అవగాహన కల్పించారు. జీవన శైలిలో మార్పులు, కొవ్వు కలిగిన ఆహార పదార్థాలు తీసుకోవడం, శారీరక శ్రమ లేకపోవడం వంటి పలు కారణాల వలన ఊబకాయంతో పలువురు ఆకస్మాత్తుగా గుండెపోటుకు గురవుతున్నారని అన్నారు. కార్యక్రమంలో వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆర్.సుప్రియ, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ సిహెచ్.హనుమంతరావు, ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.సుభాకర్ రాజు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ పి.శ్రీకాంత్ రెడ్డి, అధ్యాపకురాలు జి.హరిత, పి.సురేష్, జి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అరండల్ పేట సీఐగా వెంకటేశ్వరరెడ్డి

నగరంపాలెం: అరండల్‌పేట పోలీస్ స్టేషన్ సీఐగా ఐ. వెంకటేశ్వరరెడ్డిని నియమిస్తూ రేంజ్ ఐజీ జి. పాలరాజు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు పనిచేసిన రామానాయక్ ఎస్సీ, ఎస్టీ సెల్ విభాగ సీఐగా బదిలీ అయ్యారు.

పూర్వ విద్యార్థుల కృషి అభినందనీయం

- గుంటూరు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ టి.టి.కె.రెడ్డి
- మైక్రోబయాలజీ లెక్చర్ గ్యాలరీ, స్మార్ట్ బోర్డు ప్రారంభం



ఆధునీకరించిన లెక్చర్ గ్యాలరీని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ టి.టి.కె.రెడ్డి

గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల కృషి అభినందనీయమని ప్రిన్సిపాల్ డాక్టర్ టి.టి.కె.రెడ్డి అన్నారు. కళాశాల 1998 బ్యాచ్ విద్యార్థులు రూ. 20 లక్షలతో మైక్రోబయాలజీ లెక్చర్ గ్యాలరీని ఆధునీకరించి, స్మార్ట్ బోర్డు ఏర్పాటు చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ టి.టి.కె.రెడ్డి గురువారం వాటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళాశాల పూర్వ వైద్య విద్యార్థులు జింఖానా పేరుతో మాతృసంస్థ అభివృద్ధికి చేస్తున్న సేవ దేశవ్యాప్తంగా అందరి ప్రశంసలు పొందిందని తెలిపారు. లెక్చర్ గ్యాలరీని ఆధునీకరణ, స్మార్ట్ బోర్డు ఏర్పాటుకు సహకరించిన పూర్వ వైద్య విద్యార్థులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మైక్రోబయాలజీ విభాగాధిపతి డాక్టర్ పరమేశ్వరి, 1998 బ్యాచ్ పూర్వ వైద్య విద్యార్థులు డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ శరత్‌చంద్ర, డాక్టర్ శివరామిరెడ్డి, డాక్టర్ రామోహన్‌రావు, డాక్టర్ జ్యోతి పాల్గొన్నారు.

సంగీత విజ్ఞాన సర్వస్వం 'మంగళంపల్లి'



మంగళంపల్లికి నివాళులర్పిస్తున్న అవగాహన సంస్థ సభ్యులు

లక్ష్మీపురం: తన అనంత గానామృతంతో సంగీత అభిమానులు గుండెల్లో కొలువైన అద్భుత వాగ్గేయకారుడు, సంగీత విజ్ఞాన సర్వస్వం మంగళంపల్లి బాలమురళీకృష్ణ అని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి కొనియాడారు. అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో గురువారం బాలమురళీకృష్ణ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శివరామిరెడ్డి మాట్లాడుతూ ఆయన పలుకే బంగారమని తెలిపారు. సరిగమల సింగారం చేసిన వాగ్గేయకారుడుగా పేర్కొన్నారు. సాంస్కృతి కో–ఆర్డినేటర్ బిళ్లా అశోక్ మాట్లాడుతూ గోదారి తీరాన పుట్టిన ఆ సంగీత బ్రహ్మ తన స్వరధారతో యావత్ దేశాన్ని పులకింపజేశారని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు టి.సాయిబాబు, వి.వి.రావ్, పద్మభూషణ్ పాల్గొన్నారు.

క్యాన్సర్ పేషెంట్‌కు ఆర్థిక సాయం



కన్నయ్యకు చెక్కును అందజేస్తున్న డాక్టర్ గోపాలకృష్ణ గోఖలే

గుంటూరు మెడికల్: జీడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ నెలకుదుటి వీర వెంకట శేఖర వరప్రసాద్ (పెదకూరపాడు బుజ్జి) ఆధ్వర్యంలో క్యాన్సర్ వ్యాధి బారిన పడిన పెదకూరపాడుకు చెందిన గోగులపాటి కన్నయ్యకు రూ. 60 వేల చెక్కును అందజేశారు. గుంటూరు నవభారత్‌నగర్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు, ప్రముఖ గుండె వైద్యనిపుణులు గోపాలకృష్ణ గోఖలే, గుంటూరు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ వెన్న సాంబశివరెడ్డి చేతుల మీదుగా చెక్కును క్యాన్సర్ పేషెంట్ కన్నయ్యకు అందజేశారు. అనంతరం నరసరావుపేట పార్లమెంటు సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ పెదకూరపాడు బుజ్జి మిత్రమండలి ఆధ్వర్యంలో క్యాన్సర్ పేషెంట్‌కు ఆర్థిక సాయం అందించడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో క్రోసూరు మాజీ ఎంపీపీ దిగుమర్తి అప్పారావు, పెదకూరపాడు సర్పంచ్ గుడిపూడి రాజు, మాజీ సర్పంచ్ సాంబిరెడ్డి, పెద్దకూరపాడు బుజ్జి మిత్రులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి సంక్షేమ పథకాల బోర్డుల ఆవిష్కరణ

పొన్నూరు: పట్టణంలో జరిగిన అభివృద్ధి, ప్రజలకు అందించిన సంక్షేమ పథకాల వివరాలతో ప్రదర్శన బోర్డుల ఆవిష్కరణ కార్యకమాన్ని ఈనెల 24 నుంచి వార్డు సచివాలయాల్లో రెండో విడత నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు . 24న 1,2 వార్డు పరిధిలోని 1వ నంబర్ సచివాలయం, 28న 3, 30 వార్డు పరిధిలోని 2వ నంబర్ సచివాలయం , 29న 6వ వార్డులోని 4వ నంబర్ సచివాలయం, 30న 16, 17 వార్డు పరిధిలోని 9వ నంబర్ సచివాలయం, డిసెంబర్ 1న 21వ వార్డులోని 12వ నంబర్ సచివాలయం, 4న 23వ వార్డులోని 13వ నంబర్ సచివాలయం, 5న 24, 26 వార్డులలోని 14వ నంబర్ సచివాలయం, 6న 7, 8 వార్డు పరిధిలోని 5వ నంబర్ సచివాలయం, 7న 9,10,11 వార్డు పరిధిలోని 6వ నంబర్ సచివాలయం, 8న 12, 13 వార్డు పరిధిలోని 7వ నంబర్ సచివాలయం, 11న 14, 15 వార్డు పరిధిలోని 8వ నంబర్ సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డులను ఆవిష్కరించి, సభల ద్వారా ప్రభుత్వం ప్రజలకు చేసిన మేలును వివరించనున్నట్లు కమిషనర్ తెలిపారు. నిర్ణయించిన తేదీల్లో సాయంత్రం 3 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందని, ప్రజలు పాల్గొనాలని ఆయన కోరారు.

'తీర్మానంతోనే పంచాయతీ బిల్లులు డ్రా'

పెదకాకాని: పంచాయతీలో బిల్లులు తీర్మానాల ప్రకారమే డ్రా చేసినట్లు గ్రామ సర్పంచి వేల్పుల శ్రావణి గురువారం తెలిపారు. పెదకాకాని మండలంలోని వెనిగండ్ల గ్రామ పంచాయతీలో విచారణ చేసేందుకు డీఎల్‌పీవో లక్ష్మణరావు వచ్చి స్టేట్‌మెంట్ ఇవ్వమని కోరారన్నారు. ఆయన్ను స్వాగతించామని, విచారణకు ఎటువంటి ఆటంకం కలుగలేదని ఆమె వివరించారు. గ్రామాభివృద్ధి కోసం చేపట్టే పనులకు వర్క్ ఆర్డర్ ఇవ్వకుండా తీర్మానం జరిగితే పని అవుతుందని వార్డు సభ్యులు అవగాహన లేకుండా ఆరోపించడం మంచిది కాదని తెలిపారు. పనులు చేపట్టాలంటే తీర్మానంతో పాటు అంచనా, పని చేసేందుకు అనుమతులు తప్పక ఉండాలని చెప్పారు. గ్రామంలో చేపట్టాల్సిన పనులు నిలిచిపోవడంపై గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు మాట్లాడుకున్నారని, డీఎల్‌పీవో విచారణకు ఎటువంటి ఆటంకం కలగలేదని సర్పంచి వేల్పుల శ్రావణి వివరించారు.

హిజ్రాల జీవితాలపై ఎక్స్‌రే 'అర్ధనారి'

- మోడర్న్ మాస్టర్ పీస్‌గా గుర్తింపు
- రేపు తెనాలిలో నవలపై చర్చా వేదిక
- రచయిత బండి నారాయణస్వామి, హిజ్రా ఉద్యమ నేతల రాక



రచయిత బండి నారాయణస్వామి

తెనాలి: పట్టణానికి చెందిన సాహితీ సాంస్కృతిక వేదిక 'భిన్నస్వరాలు' ఆధ్వర్యంలో ఆహ్వానం లక్ష్మి సంస్మరణలో ప్రతి నెలా నిర్వహిస్తున్న చర్చావేదికకు ఈ నెల 25న బండి నారాయణస్వామి రచించిన 'అర్ధనారి' నవలను ఎంపిక చేశారు. స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో సాయంత్రం 5.30 గంటలకు జరగనున్న సభకు జీఎస్ నాగేశ్వరరావు సమన్వయకర్తగా వ్యవహరిస్తారు. నవల రచయిత బండి నారాయణస్వామి, ట్రాన్స్, హిజ్రా రైట్స్ యాక్టివిస్ట్ రచన ముద్రబోయిన, ట్రాన్స్ బుద్ధిస్ట్ సన్యాసిని తాషి చోదుప్ క్వీయర్, 'చినుకు' రాజగోపాల్, హిజ్రా లీడర్, ఫౌండర్ టీటీపీఏ కేఎస్‌వీ మోనాలిసా చర్చలో పాల్గొంటారు. అర్ధనారి నవల ట్రాన్స్‌జెండర్ వాస్తవికత గురించిన బహుముఖ చిత్రణ. ఈ వస్తువుకు సమాంతరంగా పడుపువృత్తిని గురించిన మరో కథనం ఉంది. రెండు సమస్యల వెనకా పితృస్వామిక సమాజాన్ని విస్తార విశ్లేషణకు గురిచేయటం ఉంది. హిజ్రాల జీవితంపై తెలుగులో అర్ధనారిలో చేసినంత వివరంగా, అంత లోతుగా డీల్ చేయటం గతంలో ఎన్నడూ జరగలేదు. 'తానా' నవలల పోటీల్లో బహుమతి పొందిన అర్ధనారిని 'మోడర్న్ మాస్టర్‌పీస్'గా వెంకట్ శిద్ధారెడ్డి అభివర్ణించారు. దిగువ మధ్యతరగతి బహుజన వ్యవసాయ కుటుంబానికి చెందిన చంద్రన్న అనే యువకుడు రమణిగా పరిణమించిన క్రమంలో.. ట్రాన్స్‌జెండర్ వ్యవస్థ నిర్మాణాన్నీ, అందులోని ఖాన్‌దాన్‌లను, గురువులను, నానీలను, చేలాలనూ, వారి జీవన విధానాన్నీ రోజువారీ ఆచరణ, ఆచార సంప్రదాయాలతో సహా అక్షరబద్ధం చేశారు. అనంతపురం జిల్లా కల్యాణదుర్గం పట్టణ కేంద్రంగా ఈ మొత్తం ఇతివృత్తాన్ని అభివృద్ధి చేశారు. మరో పక్క కింద తరగతి బహుజన గ్రామీణ కుటుంబం నుంచి వచ్చిన ముగ్గురు పిల్లల తల్లి రామలక్ష్మి భర్త చేతిలో మోసపోయి సెక్స్‌వర్కర్‌గా పోలీసులు, రౌడీలు, రాజకీయ అండ కలిగిన పడుపువృత్తి కంపెనీలు, ఇరుగు పొరుగు తనపై చేసే దాష్టీకంతో అవమానాల మధ్య చేసిన ఒంటరి పోరాటాన్ని వాస్తవంగా చిత్రీకరించారని ప్రసిద్ధ సాహితీవేత్త జి.లక్ష్మీనరసయ్య అంటారు. అనుకోకుండా పరిచయమైన చంద్రన్న, రామలక్ష్మి ఒకరికొకరు అండగా నిలుస్తారు. ట్రాన్స్‌జెండర్‌గా చంద్రన్న, సెక్స్‌వర్కర్‌గా రామలక్ష్మి తమ తమ హక్కుల కోసం వారివారి ప్రత్యేక ఉద్యమాల్లో భాగమవుతారు. అర్ధనారి చదివాక మనకు జీవితంపై ఉన్న దృక్పథం మారుతుందని లక్ష్మీనరసయ్య అంటారు. హిజ్రాలపై ఇంత వివరంగా తెలుగులో వచ్చిన తొలి నవల అర్ధనారి మాత్రమే. 'తానా' నవలలో పోటీల్లో నగదు బహుమతినీ అందుకుంది.

మహంకాళీ అమ్మవారికి రూ.1,11,116 విరాళం

తాడేపల్లి రూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరు గ్రామంలోని శ్రీ మహంకాళీ అమ్మవారి దేవస్థానానికి దాతలు గురువారం రూ.1,11,116 అందజేశారు. విజయవాడకు చెందిన జయకృష్ణ, కుసుమ దంపతులు విరాళాన్ని అందించారు. దాతలను శాలువాతో సత్కరించి, అమ్మవారి చిత్రపటాన్ని ఆలయ కార్యనిర్వహణాధికారి చినవెంకటరెడ్డి బహూకరించారు.

మత్తు పదార్థాలతో యువత జీవితాలు నాశనం



గుంటూరు రూరల్: స్వర్ణభారతినగర్ 41వ డివిజన్ పరిధిలో నిషేధిత మత్తు పదార్థాలకు యువత అలవాటు పడి జీవితాలు నాశనమవుతున్నాయని, తగిన చర్యలు తీసుకుని కాలనీవాసుల్ని కాపాడాలని ఐజీ పాల్‌రాజ్‌ను డివిజన్ కార్పొరేటర్ బి. స్మిత పద్మజ కోరారు. ఈ మేరకు గురువారం ఐజీ కార్యాలయంలో ఆయన్ను కలసి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని స్వర్ణభారతీనగర్, పుచ్చలపల్లి సుందరయ్య కాలనీ, మిషన్‌ఫారం, రామాంజనేయులు కాలనీ, ఓల్డ్ రాజీవ్ గృహకల్ప, న్యూరాజీవ్ గృహకల్ప తదితర ప్రాంతాల్లో మత్తు పదార్థాలు విచ్చలవిడిగా విక్రయాలు జరుగుతున్నాయని ఫిర్యాదు చేశారు. పోలీసులు తగిన చర్యలు తీసుకుని యువతను కాపాడాలని ఆమె కోరారు.

ఇద్దరు యువకుల నుంచి గంజాయి స్వాధీనం

పట్నంబజారు: గంజాయి కలిగి ఉన్న ఇద్దరు యువకులపై కేసు నమోదైంది. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాంత్, పవన్‌లు రెండు ద్విచక్ర వాహనాలపై వస్తున్నారు. అదే సమయంలో లాడ్జి సెంటర్‌లో పోలీసులు వాహనాలు ఆపి తనిఖీ చేయగా, ఇద్దరి వద్దా 60 గ్రాముల గంజాయి దొరికింది. ఈ మేరకు వారిని అదుపులోకి తీసుకుని, ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి అరెస్టు చేసి కోర్టులో హాజరుపరుస్తున్నట్లు తెలిపారు.

సచివాలయంపై దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు

సచివాలయంపై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదైంది. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోబాల్ట్‌పేటలోని 113వ సచివాలయానికి గురువారం మక్కెన వెంకటేశ్వర్లు పూటుగా మద్యం తాగి వెళ్లాడు. సిబ్బందితో ఘర్షణ పడి, సచివాలయ అద్దాలు, ఫర్నీచర్‌ను ధ్వంసం చేశాడు. సచివాలయ అధికారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

మహిళ మెడలో గొలుసు లాక్కొని ఆగంతకుడు పరారైన సంఘటనపై కేసు నమోదైంది. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బ్రాడీపేటకు చెందిన పద్మావతి భాష్యం కళాశాలలో అధ్యాపకురాలిగా పని చేస్తున్నారు. ఈనెల 18న ఇంటికి నడుచుకుంటూ వెళుతున్న సమయంలో బ్రాడీపేట 6/19లో గుర్తు తెలియని వ్యక్తి బైక్‌పై వచ్చి మెడలోని 24 గ్రాముల బంగారపు గొలుసు లాక్కొని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.